# ఐఏఎస్, ఐపీఎస్‌ల సిఫారసు లేఖలు రద్దు!

**ఏప్రిల్ నుంచి జూన్ 30 వరకు • రద్దీ దృష్ట్యా టీటీడీ నిర్ణయం**

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): తిరుమలలో క్రమేణా భక్తుల రద్దీ పెరుగుతున్నది. ఉగాదితో పాటు వరుస సెలవులు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు తరలి వెళ్తున్నారు. కాగా, వేసవిలో రద్దీ ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో టీటీ డీ కీలక నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. సాధారణ భక్తులకు ప్రాధాన్యమిస్తూ వీఐపీ దర్శనాలను కుదించాలని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం బ్రేక్ దర్శనాల కారణంగా సాధారణ భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ మొదటి వారం నుంచి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, స్థానిక అధికారులు, చిన్నచిన్న ప్రభుత్వ సంస్థల సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాన్ని రద్దు చేయనున్నట్టు సమాచా రం. స్వయంగా వచ్చే అధికారులకు మాత్ర మే దర్శనం అవకాశం కల్పించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వానికి టీటీడీ సమాచారం ఇచ్చినట్టు తెలుస్తున్నది. ఒకేసారి రద్దు చేయకుండా ముందస్తు సమాచారం ఇచ్చి క్రమంగా అమలు చేయాలని భావిస్తున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాగా, శనివారం శ్రీవారిని 76 వేల మంది భక్తులు దర్శించుకోగా.. హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు 31 కంపార్టుమెంట్లలో వేచి ఉన్నారు. ఉచిత దర్శనానికి సుమారు 20 గంటల సమయం పడుతున్నది.

# నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

హైదరాబాద్, మార్చి30 (నమస్తే తెలంగాణ): గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు మూడునెలలపాటు ఉచిత ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్టు వోల్‌స్కై టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్ యోజన పథకంలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. టెలికంరంగానికి సంబంధించి బ్రాండ్ బాండ్ టెక్నీషియన్, గ్రామీణ్ ఉద్యాని ప్రోగ్రామ్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 18-28ఏండ్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతీ యువకులు శిక్షణకు అర్హులని వివరించారు. శిక్షణకాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 97047 82992, 98489 87588 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# చివరి దశకు సారా నిర్మూలన

**ఎక్సైజ్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి**

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సారా నిర్మూలన చివరి దశకు చేరుకుందని, సారా తయారీ, అమ్మకాలు, రవాణాపై తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది మూడుసార్లు నెల రోజుల చొప్పున స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని పేర్కొన్నారు. ఏప్రిల్ 20 నాటికి రాష్ట్రంలో ఎక్కడా నాటుసారా తయారీ, అమ్మకాలు, రవాణా ఆనవాళ్లు లేకుండా చేయాలనే లక్ష్యంతో 13 జిల్లాల్లో 25 ఎక్సైజ్ స్టేషన్లలో నిత్యం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలీసుల సహకారం తీసుకుంటూ నాటుసారాపై ఉక్కుపాదం మోపుతున్నట్టు చెప్పారు. మార్చిలో ఎస్టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు దాడులు చేసి, 40 కేసుల్లో 85 మందిని అరెస్టు చేసి, 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 20 లీటర్ల నాటుసారా, 312 కిలోల గంజాయి, 30 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ తోపాటు 35 గ్రాముల ఓజీకుష్, 13.5 లీటర్ల మద్యం కూడా అందులో ఉందని వివరించారు.

# మావోయిస్టుల ఘాతుకానికి మహిళ బలి

**ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర పేలడంతో ఘటన**

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 30: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం మావోయిస్టుల ఘాతుకానికి ఓ మహిళ బలైంది. బీజాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోఢీ పారాకు చెందిన సుశీల సోఢి ఇప్ప పువ్వు సేకరణకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు బొట్టమర్కాలోని కొండ ప్రాంతానికి వెళ్లింది. ఈ క్రమంలో జవాన్లను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై సుశీల అడుగు వేయడంతో అది పేలి తీవ్రంగా గాయపడింది. గమనించి గ్రామస్థులు అక్కడికి చేరుకుని సుశీలను హుటాహుటిన ఉసూర్ దవాఖానకు తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మండుతున్న ఎండలు

- **వడగాడ్పులతో అల్లాడుతున్న జనం**
- **ఏప్రిల్ మొదటివారంలో తేలికపాటి వర్షాలు : వాతావరణశాఖ**

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భానుడి తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 9గంటల నుంచే ఎండలు మండుతుండటం, మధ్యాహ్నం వేళల్లో వడగాడ్పులు అధికమవ్వడంతో ప్రజలు బయటకురావటానికి జంకుతున్నారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసినట్టు పేర్కొన్నది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 41.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాగా, భద్రాద్రి-కొత్తగూడెం, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల్లో 41.4, ఆదిలాబాద్, జోగులాంబ-గద్వాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, వనపర్తి జిల్లాల్లో 41.3, నిర్మల్ జిల్లాలో 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది. అలాగే ఏప్రిల్ 2,3,5న గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లవేగంతో ఈదురుగాలులు వీస్తూ.. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వివరించింది.

















